యథేచ్ఛగా మట్టి దందా

- కరిగిపోతున్న హంద్రీనీవా కాలువ గట్లు
- చెరువులు, కొండ గుట్టల్లోనూ తవ్వకాలు
- అన్నీ తెలిసినా చోద్యం చూస్తున్న అధికారులు



బేవనహళ్లి సమీపంలో హంద్రీనీవా కాలువ పక్కన ఉన్న కాలువ గట్టును జేసీబీ యంత్రాలతో తవ్వి టిప్పర్‌లోకి మట్టి నింపుతున్న దృశ్యం



కిరికెర సమీపంలో లేవుట్‌ను సిద్ధం చేయడానికి మట్టిని గుట్టలుగా వేస్తున్న దృశ్యం

హిందూపురం: నియోజకవర్గంలో మట్టి దందా జోరుగా సాగుతోంది. చెరువులు, కాలువ గట్లు, కొండలను యంత్రాలతో తవ్విస్తూ కొందరు కూటమి నేతలు దర్జాగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఏకంగా జేసీబీలు, ట్రక్కులను వినియోగిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. హిందూపురం మండలం బేవనహళ్లి గ్రామం సమీపంలో ఉన్న హంద్రీనీవా కెనాల్ పక్కన ఉన్న మట్టి గుట్టలను జేసీబీ యంత్రాలతో తవ్వేసి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. కెనాల్ నిర్మాణ సమయంలో తవ్వినమట్టిని పక్కనే ఉన్న గుట్టలపై వేసేశారు. అది కస్తా పెద్ద మట్టి దిబ్బలుగా మారాయి. దీంతో మట్టిగుట్టలు బకాసురులకు ఆదాయ వనరులుగా మారాయి. తమ ప్రభుత్వంలో తమను ఎవరు ప్రశ్నించేది అన్న రీతిలో కొందరు కూటమి నేతలు మట్టి దందాను సాగిస్తున్నారు. రోజూ కాలువ వెంబడి జేసీబీలతో మట్టి గుట్టలను తవ్వేయడం, తరలించడం సాగిపోతోంది. మట్టి కిరికెర సమీపంలోని ఎల్‌ఆర్‌జీ కాలేజ్ వెనుక లేఅవుట్ నిర్మాణానికి తరలిస్తున్నారు. కుప్పలు తెప్పలుగా అక్కడ డంప్ చేస్తున్నారు.



అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్

అధికారులకు పట్టదా?

బేవనహళ్లి, కిరికెర, పూలకుంట, చౌళూరు, సంతే బిదనూర్ తదితర ప్రాంతాల్లో యాథేచ్ఛగా రాజకీయ నాయకుల అండతో మట్టి, ఇసుకను తోడేస్తున్నారు. టిప్పర్ మట్టి రూ.1500 నుంచి రూ.2 వేల వరకూ అమ్ముకుంటున్నారు. మట్టిదిబ్బలు, గుట్టలు మట్టి బకాసుకారులకు ఆదాయ వనరులుగా మారాయి. కనుల ఎదుటనే మట్టి దందా జరుగుతున్నా అధికారులెవరూ నోరు మెదపక పోవడం దారుణం. ఇప్పటికైనా మట్టి దందాకు చెక్ పెట్టాలి.

– సింగిరెడ్డిపల్లి, మోతుకుపల్లి

అక్రమంగా తవ్వకాలు చేస్తే చర్యలు

నియోజకవర్గ వ్యాప్తంగా అక్రమంగా చెరువులు, కాలువ గట్లు, కుంటల వద్ద మట్టి, ఇసుక తవ్వకాలు చేస్తే సహించేది లేదు. అలా ఎవరూ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మట్టి , ఇసుక తవ్వకాలు చేసే వాహనాలను సీజ్ చేస్తాము. పోలీసు కేసులు కూడా నమోదు చేయించేలా చర్యలు చేపడతాము.

– శైలేంద్రనాథ్, డీఈఈ, ఇరిగేషన్, హిందూపురం

సజ్జలను కలిసిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

పెనుకొండ: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అడ్వయిజరీ కమిటీ సభ్యుడు సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ కలిశారు. అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా అనంతపురం వైపు వెళ్తుండగా స్థానిక జాతీయ రహదారిలోని పెనుకొండ వై జంక్షన్ వద్ద వారికి పుష్పగుచ్ఛాలు అందించారు. కాసేపు వారితో నియోజకవర్గ విషయాలను ముచ్చటించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుధాకరరెడ్డి, టౌన్ కన్వీనర్ నరసింహ, మాజీ కన్వీనర్ శ్రీకాంతరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, ఉపసర్పంచ్ వేణుతో పాటు సోమందేపల్లి కన్వీనర్ గజేంద్ర, గొల్లపల్లి ప్రకాష్‌రెడ్డి, నారాయణస్వామి, ఇమాంవలి, ట్రాక్టర్ శ్రీరాములు, చెన్నకేశవ తదితరులున్నారు.



సజ్జల రామకృష్ణారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డికి పుష్ప గుచ్ఛాలు అందజేసిన మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

గ్రామకంఠంలో పట్టాలు మంజూరు చేస్తే ఊరుకోం

రొద్దం: మండల పరిధిలోని తురకలాపట్నం గ్రామంలో సర్వేనంబర్ 251–1లో ఉన్న గ్రామ కంఠం (పశువుల దొడ్డి) స్థలంలో ఏళ్లుగా కొందరు రైతులు ఎరువు దిబ్బలు వేసుకున్నారు. అయితే శుక్రవారం తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు ఎరువు దిబ్బలను తీయించారు. ఇదిలా ఉండగా.. గ్రామంలోని గాలి బంక్ వెనుక భాగంలో ఉన్న గ్రామ కంఠం స్థలంలో రెవెన్యూ అధికారులు ఎవరికైనా పట్టా మంజూరు చేస్తే ఊరుకోమని గ్రామస్తులు తెలిపారు. తహసీల్దార్ ఎరువు దిబ్బలను ఖాళీ చేయించడంతో ఎవరికైనా అందులో పట్టా ఇస్తారేమోనన్న అనుమానం ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు. పక్కనే మరో సర్వే నంబర్ 252-1 లెటర్‌లో రోడ్డు ఉందన్నారు. పదేళ్ల క్రితమే ఆ స్థలంలో బస్‌షెల్టర్ నిర్మించాలని గ్రామస్తులు పలుమార్లు అధికారులు వినతులు ఇచ్చారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో గ్రామకంఠం స్థలంలో పట్టా మంజూరు చేస్తే ఆందోళన చేస్తామని సర్పంచ్ లక్ష్మీదేవి హెచ్చరించారు. ఆ సర్వే నంబర్లలో సానిపల్లి ప్రధాన రహదారి, ఇటువైపు పావగడ–పెనుకొండ ప్రధాన రహదారి ఉందన్నారు. ఇప్పటికే తహసీల్దార్‌కు సర్పంచ్ వినతిపత్రం సమర్పించినట్లు పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ ఉదయశంకర్‌రాజును 'సాక్షి' వివరణ కోరగా ఇళ్ల మధ్యలో ఎరువు దిబ్బలు ఉండటంలో కొందరు గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వర్షాకాలం కావడంతో ఎరువు దిబ్బల వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని పంచాయతీ కార్యదర్శికి గ్రామస్తులు వినతి ఇచ్చారన్నారు. పంచాయతీ కార్యదర్శి విన్నపం మేరకే ఎరువు దిబ్బలు ఖాళీ చేయించామని, ఆ స్థలంలో ఎవరకీ ఇళ్ల పట్టాలు మంజూరు చేయబోమన్నారు.

కుంచిటి వక్కలిగలు విద్యావంతులుగా ఎదగాలి

పావగడ: కుంచిటి వక్కలిగలు విద్యావంతులుగా ఎదిగి ఉన్నత స్థానాల్లో రాణించాలని స్థానిక ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ ఆకాంక్షించారు. స్థానిక ఎస్‌ఎస్‌కే సముదాయ భవనంలో శుక్రవారం నిర్వహించిన బెంగుళూరు నగర నిర్మాత నాడ ప్రభు కెంపేగౌడ 516 వ జయంతి వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వక్కలిగల సముదాయ భవన నిర్మాణానికి తన వంతు సహకార మందిస్తానన్నారు. ఈ సందర్భంగా పది, పీయూసీలో ఉత్తమ మార్కులు సాధించిన కుంచిటి వక్కలిగ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎం తిమ్మరాయప్ప, జంగమర హళ్లి ముద్ద వీరప్ప, తాలూకా వక్కలిగ సంఘం అధ్యక్షుడు తిప్పేవీరణ్ణ, కార్యాధ్యక్షుడు ఎస్‌ఏ ఈరణ్ణ, తహసీల్దార్ వరదరాజు తదితరులు పాల్గొన్నారు.



కెంపేగౌడ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

చెట్ల తొలగింపుపై ఫిర్యాదు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని అక్కమ్మ కొండ సమీపంలో తమ సొంత భూమిలో పెంచుకుంటున్న మామిడి చెట్లను సజ్జరాయప్ప తదితరులు దౌర్జన్యంగా తొలగించారని రామాంజినమ్మ అనే మహిళా ఎస్‌ఐ రమేష్ బాబుకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 756–2లో 2 ఎకరాలకు పైగా భూమిని 1981వ సంవత్సరంలో తమ మామ మాల హనుమంతప్ప కొనుగోలు చేశారని పేర్కొన్నారు. అయితే ఆ భూమి కబ్జా చేయడానికి తమ సొంత భూమిలో పెంచుకుంటున్న చెట్లను అక్రమంగా తొలగించడమే కాకుండా కులం పేరుతో తమను దూషించారని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసి, తమకు న్యాయం చేయాలని ఎస్‌ఐను కోరారు.

ప్రాణాలతో చెలగాటం

చిలమత్తూరు: మండల పరిధిలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్ట్‌లోని ఎక్సైజ్ శాఖ చెక్ పాయింట్‌లో ఏర్పాటు చేసిన షెడ్డు వద్ద విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. శుక్రవారం ఉదయం రోడ్డుపై ఇలా విద్యుత్ తీగలు పడటంతో వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. షెడ్డుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు నామమాత్రపు సపోర్టు ఉంచి అలా వదిలేశారు. గాలి వీచడంతో అది కాస్తా కిందకు పడిపోయింది. ఆదమరచి అటుగా ఎవరైనా వచ్చింటే మాత్రం ప్రాణాలు గాల్లో కలిసేవని స్థానికులు తెలిపారు.



కొడికొండ చెక్‌పోస్ట్‌లో ఎక్సైజ్ పాయింట్ వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగ

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు

హిందూపురం: గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు తప్పని సరిగా నట్టల మందును కాపరులు తాపించాలని పశు వైద్య సహాయకుడు డాక్టర్ షేక్ అబ్దుల్ రహీం తెలిపారు. హిందూపురం మండల స్థానిక బేవినాహళ్లి గ్రామ పంచాయతీలో శుక్రవారం గొర్రెలు, మేకలకు పాకల వద్దనే ఉచితంగా నట్టల మందు తాపించే కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బేవినాహళ్లిలో పశుసంవర్ధకశాఖ రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో సుమారు 1,750 గొర్రెలు, మేకలకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం జూలై 10వ తేదీ వరకూ మండలంలో కొనసాగుతుందన్నారు. ఇటీవల కురుస్తున్న తొలకరి వర్షాల కారణంగా బయలు ప్రదేశాల్లో మొలచిన గడ్డిని మేకలు, గొర్రెలు మేస్తుటంతో నట్టల వ్యాధి ప్రబలి నోటిద్వారా ప్రవేశించి వ్యాపి చెంది రక్తహీనతతో ఉత్పాదకత, పెరుగుదల ఆగిపోవడం జరుగుతుందన్నారు. దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల కాపరులు నట్టల నివారణ మందు వేయించాలని సూచించారు.



గొర్రెకు నట్టల నివారణకు మందు వేస్తున్న వైద్యుడు

కొల్హాపురి మహాలక్ష్మీదేవికి పూజలు

రొళ్ల: రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవిని శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేకువజామున అమ్మవారి మూల విగ్రహంతో పాటు ఉత్సవ అమ్మవారికి భక్తులు కానుక రూపంలో తీసుకొచ్చిన పట్టు వస్త్రాలుతో పాటు వడిబియ్యం కట్టి వెండి, బంగారు ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. సంతాన భాగ్యం లేనివారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, పెళ్లి కాని యువతులు తదితరులు ఆలయం ఎదురుగా ఉన్న పాలబావి వద్దకు చేరుకుని గంగ పూజ చేసి మొక్కులు తీర్చుకున్నారు.



అలంకరణలో మహాలక్ష్మీదేవి

వైభవంగా జగన్నాథ రథయాత్ర



హిందూపురం ప్రధాన రహదారిలో సాగుతున్న జగన్నాథ రథయాత్ర



రథం ముందు ఆడిపాడుతూ స్వాగతిస్తున్న భక్తులు

హిందూపురం: అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘ (ఇస్కాన్) ఆధ్వర్యంలో హిందూపురంలోని ముదిరెడ్డిపల్లి నుంచి పురవీధుల గుండా జగన్నాథ రథయాత్ర వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. ముదిరెడ్డిపల్లిలోని చౌడేశ్వరీ ఫంక్షన్‌లో శ్రీకృష్ణ, బలరామ, సుభద్రదేవి విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనం ఊరేగించారు. ముదిరెడ్డిపల్లి , మేళాపురం, ఆర్టీసీ బస్టాండ్, అంబేద్కర్ సర్కిల్, రైల్వేరోడ్డు వరకూ యాత్ర సాగింది. విగ్రహాలను వాసవీధర్మశాల ఫంక్షన్ హాల్‌కు తీసుకువచ్చారు. అనంతరం రథానికి పూజలు చేసి శ్రీకృష్ణ బలరామ సుభద్రదేవి ఉత్సవ మూర్తులు కళ్యాణ మండపంలో కొలువుదీర్చి పూజలు చేశారు. ముదిరెడ్డిపల్లిలోని చౌడేశ్వరీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు ధర్మం, న్యాయం పక్కన నిలిచారన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, కౌన్సిలర్ మద్దెన జయప్ప తదితరులు పాల్గొన్నారు.



అలంకరణలో శ్రీకృష్ణ, బలరామ, సుభద్ర విగ్రహాలు

క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శుల సామూహిక సెలవు



ఎంపీడీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్యదర్శులు

లేపాక్షి: మండల వ్యాప్తంగా పనిచేస్తున్న పంచాయితీ కార్యదర్శులు శనివారం సామూహిక సెలవుపై వెళ్తున్నాం. సెలవు మంజూరు చేయాలంటూ ఎంపీడీఓ నరసింహామూర్తికి శుక్రవారం సదరు ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పంచాయతీ కార్యదర్శుల సంఘం నేతల ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ విషయం కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, రమేష్‌బాబు, మల్లికార్జున, వెంకటబాబ్జి, దుర్గయ్య, కవిత, విజయకుమార్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

బదిలీ వైద్యుడికి సన్మానం



జయకుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడిగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల నిర్వహించిన బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లాకు బదిలీ అయిన డాక్టర్ జయకుమార్‌ను శుక్రవారం ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తదితరులు డాక్టర్ జయకుమార్ సేవలను కొనియాడారు. అనంతరం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేస్తున్న మంత్రి సవిత

పెనుకొండ: ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళీశాఖామంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో మంత్రి రూ. 28.80 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను గోరంట్ల, పరిగి మండలాలకు చెందిన బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ ప్రజలు అత్యవసర వేళలో అనారోగ్యం బారిన పడి ఉన్నత ఆస్పత్రుల్లో సొంత డబ్బు వెచ్చించి చికిత్స చేయించుకుంటే వారు చెల్లించిన డబ్బును సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పొందడానికి అర్హత ఉంటుందన్నారు. బాధితులు ఎవరైనా ఈ స్కీం ద్వారా సాయం పొందవచ్చని పేర్కొన్నారు. వచ్చిన డబ్బును సద్వినియోగం చేసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు.

బెంగళూరు జగన్నాథ రథయాత్రకు ప్రత్యేక బస్సులు



హిందూపురం నుంచి బయలుదేరుతున్న ఆర్టీసీ బస్సు

హిందూపురం: పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి బెంగళూరులో ఇస్కాన్ టెంపుల్‌లో జరిగే జగన్నాథ రథయాత్రకు శుక్రవారం ప్రత్యేకంగా రెండు బస్సులు బయలుదేరాయి. హరే కృష్ణ మూమెంట్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి భక్తులను బెంగళూరుకు తరలివెళ్లారు. ఇస్కాన్ టెంపుల్‌లో జరిగే రథయాత్ర వేడుకల్లో పాల్గొన్న అనంతరం వారిని తిరిగి హిందూపురానికి తీసుకురానున్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

పావగడ: తాలూకాలోని అరసికెరె ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులకు మాతృశ్రీ సేవా సంస్థ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, బాల్ పాయింట్ పెన్నులతో పాటు స్వీట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సామగ్రిని సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలన్నారు.

ఏఈఓగా మంజుల బాధ్యతలు



గుడిబండ: మండల కేంద్రంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయశాఖ విస్తరణ అధికారిణి (ఏఈఓ)గా మంజుల బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఏఈఓగా పని చేస్తున్న హేమతల రొళ్ల మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం తిరుపతిలో ఏఓ ట్రైనింగ్ పూర్తి చేసుకున్న మంజుల గుడిబండ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వ్యవసాయశాఖ ద్వారా పంట సాగు పై సలహాలు, సూచనాలు తెలియజేస్తామన్నారు. రైతులు పంట సాగులో ఏమైనా సమస్యలు ఉంటే వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

గుడిబండ: మడకశిర కోర్టు ఆవరణలో జూలై 5వ తేదీన నిర్వహించనున్న మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ రాజ్ కుల్లాయప్ప తెలిపారు. రాజీకాగల కేసులను లోక్‌అదాలత్ ద్వారా సత్వరమే పరిష్కరించుకోవాలని కోరారు.

వ్యక్తి కనిపించడం లేదని ఫిర్యాదు

హిందూపురం: పట్టణంలోని ముక్కిడిపేటకు చెందిన చంద్రశేఖర్ (39) రెండురోజులుగా కనిపించడంలేదని భార్య చంద్రకళ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. భార్యభర్తలు ఇంట్లో గొడవపడటంతో ఇంటి నుంచి బయటకు వెళ్లిన పోయిన చంద్రశేఖర్ రాత్రి అయినా ఇంటికి రాకపోవడంలో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. ఈ విషయంపై ఫిర్యాదు చేయడంలో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పని ఒత్తిడి తగ్గించండి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రొళ్ల: అధిక పని ఒత్తడి కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పంచాయతీ కార్యదర్శులు శ్రీనాథ్, బాబురావు, రచన, పరమేష్ తదితరులు వాపోయారు. పని ఒత్తిడి తగ్గించాలని కోరుతూ శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేశ్వరశాస్త్రికి వినతి పత్రాన్ని అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ జీఎస్‌డబ్ల్యూస్ సర్వేలు, సచివాలయాల నిర్వహణ, గ్రామ పంచాయతీలో ఉదయం 6 గంటల నుంచే పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఐవీఆర్ఎస్ కాల్స్, వీడియో కాల్స్ ఆదేశించడంతో పాటు రోజుకు దాదాపు 12 గంటలు పని చేయాల్సిన పరిస్థితి వస్తోందన్నారు. దీని వల్ల కుటుంబ సభ్యులకు సమయం కేటాయించలేక పోతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుని రోజు వారి పని ఒత్తిడిని తగ్గించాలని కోరారు.

శాకాంబరిగా యల్లమ్మదేవి



హిందూపురం: ఆషాడ మాసం సందర్భంగా నింకంపల్లి రోడ్డులో ఉన్న యల్లమ్మ ఆలయంలో మూల విరాట్ అమ్మవారి విగ్రహాన్ని శాకాంబరిదేవి అలంకరించారు. ఉదయం ఆలయంలో అమ్మవారికి పసుపు, కుంకుమలతో అభిషేకించి తర్వాత పంచామృతాభిషేకాలు నిర్వహించారు. వివిధ కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

శివాపురంలో నాకాబందీ



మాట్లాడుతున్న సీఐ నగేష్‌బాబు

మడకశిరరూరల్: పట్టణంలోని శివాపురంలో శుక్రవారం ఉదయం సీఐ నాగేష్‌బాబు ఆధ్వర్యంలో నాకాబందీ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాట్కా, జూదం నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ప్రశాంత వాతావరణంలో కలసి మెలసి జీవనం సాగించాలన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

పెనుకొండ: పట్టణానికి చెందిన లెక్చరర్ ఉమాశంకర్ శుక్రవారం పేద విద్యార్థికి రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. పట్టణానికి చెందిన డ్రైవర్ రవీంద్రనాయక్ కుమారుడు సంతోష్‌నాయక్ ఇటీవల నీట్ పరీక్షల్లో మంచి ర్యాంక్ వచ్చింది. అయితే విద్యార్థి ఉన్నత చదువుకు ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారడంతో విషయం తెలుసుకున్న అధ్యాపకుడు రూ. 20 వేలు ఆర్థికసాయం చేసి తన ఔదార్యాన్ని చాటుకున్నాడు.